

116 మందికి నేత్ర పరీక్షలు


నేత్ర పరీక్షలు చేస్తున్న వైద్యులు

తాడేపల్లిగూడెం : లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కడకట్లలోని జనతా హాస్పటల్లో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. పిఎంజెఎఫ్ లయన్స్ పదం కుమార్ గుప్తా ఆర్థిక సహకారంతో నిడదవోలు రాజరాజేశ్వరి రామకృష్ణన్ లయన్స్ హాస్పిటల్ వైద్యులు ఉచిత నేత్ర వైద్య సేవలు అందించారు. ఈ శిబిరంలో 116 మందికి పరీక్షలు నిర్వహించి, 20 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. 14 మందిని ఉచిత ఆపరేషన్ నిమిత్తం నిడదవోలు ఆసుపత్రికి పంపించినట్లు తెలిపారు. ఎంజెఎఫ్ లయన్స్ సుంకర శ్రీనివాసరావు, కార్యదర్శి చిన్నం జగదీష్, భీమవరపు మహాలక్ష్మి, ఎల్ఎస్‌వి.నాగేశ్వరరావు(జనత డాక్టర్), లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

అపరాలపై తెగుళ్ల దాడి..!



- మినుము, పెసర రైతులు గగ్గోలు
- వైరస్, తెగుళ్లతో దెబ్బతింటున్న పంట
- దాదాపు 40 వేల ఎకరాల్లో అపరాల సాగు
- ఎకరాకు రూ.20 వేలకు పైగా పెట్టుబడి ఖర్చు
- దిగుబడిపై తీవ్ర ప్రభావం పడనుందని అన్నదాత ఆందోళన
- వ్యవసాయాధికారులు పట్టించుకోవాలని వేడుకోలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

మినుము, పెసర, కందులు, ఉలవలు వంటి అపరాల పంటలపై వైరస్ తెగుళ్ల దాడి చేస్తున్న పరిస్థితి నెలకొంది. దీంతో పంట చివరి దశలో దెబ్బతినే పరిస్థితి ఏర్పడడంతో రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. తగు సూచనలు, సలహాలు ఇవ్వాల్సిన వ్యవసాయాధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే పెద్దఎత్తున పెట్టుబడి ఖర్చు అవ్వడంతో తమ పరిస్థితి ఏంటన్న భయం అన్నదాతను వెంటాడుతోంది. జిల్లాలో ఏలూరు, పెదపాడు, దెందులూరుతోపాటు ఇతర మండలాల్లోనూ రైతులు పెద్దఎత్తున అపరాల సాగు చేపట్టారు. ఏలూరు జిల్లా వ్యాప్తంగా పెసర పంట 15,847 ఎకరాల్లో, మినుము సాగు 23,437 ఎకరాల్లో, 23 ఎకరాల్లో కంది, 156 ఎకరాల్లో ఉలవ, ఇతర పంటలు కలుపుకుని మొత్తం దాదాపు 39,475 ఎకరాల్లో రైతులు అపరాల సాగుచేశారు. పశ్చిమలోనూ పలుచోట్ల అపరాల సాగు సాగుతోంది. ప్రస్తుతం పంటంతా పూత, పిందె దశలో ఉంది. దాళ్వా లేకపోవడంతో పెదపాడు వంటి మండలాల్లో అపరాల సాగుపైనే రైతులు పూర్తిగా ఆధారపడిన పరిస్థితి నెలకొంది. పూత, పిందె దశలో వైరస్, తెగుళు అపరాల పంటలను నాశనం చేస్తున్నాయి. ఆకులు ఎండిపోయి మొక్క దెబ్బతినే పరిస్థితి ఏర్పడింది. తెగుళ్లను అరికట్టేందుకు రైతులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. పెద్ద ఎత్తున పురుగుమందులు పిచికారీ చేస్తున్నారు. అయినప్పటికీ ఫలితం లేకపోవడంతో రైతులకు ఏంచేయాలో దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. పురుగుమందు పిచికారీ చేయాలంటే ఎకరాకు ప్రతిసారీ రూ.రెండు వేల నుంచి రూ.మూడు వేల వరకూ అవుతోందని రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఈ దశలో తెగుళ్ల దాటితో దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపనుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే అన్ని ఖర్చులూ కలుపుకుని ఎకరాకు రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకూ అవుతోందని రైతులు చెబుతున్నారు. దిగుబడి సరిగ్గా రాకపోతే రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడనుంది. ఏలూరు రూరల్‌లోని మాదేపల్లి, లింగారావుగూడెం గ్రామాల్లో అపరాల పంటలపై వైరస్, తెగుళ్లు మరింత ఎక్కువగా ఉన్న పరిస్థితి ఉన్నట్లు రైతులు చెబుతున్నారు. తెగుళ్ల నివారణకు సంబంధించి రైతులకు సరైన సూచనలు ఇవ్వాల్సిన స్థానిక వ్యవసాయశాఖ అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తెగుళ్ల నివారణకు సంబంధించి అధికారులు రైతులకు సరైన సూచనలు, సలహాలు ఇస్తే మేలు జరిగే అవకాశం ఉంటుంది. అంతేకాకుండా తెగుళ్లతో పంట దెబ్బతిన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాల్సి ఉంది.

కౌలురైతులపై తీవ్ర ప్రభావం

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలో వ్యవసాయ సాగులో 70 శాతం కౌలురైతులే చేస్తున్నారు. పంటలు దెబ్బతింటే కౌలురైతులే తీవ్రంగా నష్టపోతున్నారు. ఆ కారణంగానే కౌలురైతుల ఆత్మహత్యలు చోటు చేసుకుంటున్నాయి. ఖరీఫ్‌లో తుపాన్లు, భారీ వర్షాలతో రైతులు తీవ్ర నష్టాలను చవిచూశారు. పంట నష్టపరిహారం మాత్రం భూ యజమానుల ఖాతాల్లోకి చేరింది. ఇప్పుడు అపరాల సాగులోనూ కౌలురైతులే అత్యధికంగా ఉన్నారు. పంట దెబ్బతింటే కౌలు రైతులు నష్టపోనున్నారు. కౌలు రైతులకు అండగా ఉంటామంటూ అధికారంలోకొచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పటికీ వారికి అనుకూలంగా ఏ ఒక్క నిర్ణయమూ తీసుకోలేదు. కొత్త కౌలుచట్టం తెస్తామని హామీ ఇచ్చిన పట్టించుకోని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం అందించే ఏ ఒక్కసాయమూ కౌలురైతులకు అందడం లేదు. అపరాల రైతుల సమస్యలపై అధికారులు దృష్టిసారించి ఆదుకోవాల్సి ఉంది.

అపరాల రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

కె.శ్రీనివాస్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి

కృష్ణా డెల్టా పరిధిలో రెండో పంటకు సాగునీరందక పెద్దఎత్తున రైతులు అపరాల సాగు చేపట్టారు. తెగుళ్లకు సంబంధించి పురుగుల మందులకు రూ.వేలు ఖర్చు చేస్తున్నా ఫలితం లేకుండా పోయింది. పూత, పిందె దశలో పంటలు ఎండిపోతున్నాయి. ఎకరాలకు రెండు, మూడు క్వింటాళ్ల దిగుబడి వచ్చే పరిస్థితి కూడా కనిపించడం లేదు. నష్టపోతున్న అపరాల రైతులను ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకోవాలని కోరుతున్నాం.

రూ.14 కోట్లతో దమయపత్రి డ్రెయిన్ పనులు

మంత్రి నిమ్మల రామానాయుడు


దమయపత్రి డ్రెయిన్‌ను పరిశీలించిన మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - పాలకొల్లు

దమయపత్రి డ్రెయిన్ పనులు పూర్తిచేసి పాలకొల్లు పట్టణాన్ని ముంపు నుంచి కాపాడతామని జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పాలకొల్లులో రూ.14 కోట్లతో చేపట్టనున్న దమయపత్రి మురుగు డ్రెయిన్‌ను మంత్రి నిమ్మల రామానాయుడు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. గత వైసిపి ఐదేళ్ల పాలనలో అర్ధ రూపాయి పని, అరబస్తా సిమెంటు పనికి నోచుకోకపోవడంతో వర్షాకాలం అంతా పట్టణం ముంపులోనే ఉందని చెప్పారు. దమయపత్రి డ్రెయిన్ పనులు పూర్తిచేసి పాలకొల్లు పట్టణాన్ని ముంపు నుంచి కాపాడతామన్నారు. చెత్త మీద పన్నువేసి పట్టణ ప్రజలపై భారం మోపిన చెత్త ప్రభుత్వం జగన్ ప్రభుత్వం అన్నారు. పట్టణాలకు 85 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను రాష్ట్రానికి జగన్ వారసత్వంగా ఇచ్చాడని చెప్పారు. స్వచ్ఛభారత్ కోసం కేంద్రం ఇచ్చిన నిధులకు గత వైసిపి ప్రభుత్వం కనీసం రాష్ట్ర వాటా కూడా చెల్లించకపోవడంతో చెత్త పేరుకుపోయి అనారోగ్య ప్రదేశ్‌గా మారిపోయిందని తెలిపారు. నేడు స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర పేరిట పరిశుభ్రతతోనే ప్రజలకు మంచి ఆరోగ్యం, మెరుగైన సమాజం కోసం చంద్రబాబు శ్రమిస్తున్నారని తెలిపారు.

నేడు పిజిఆర్ఎస్ రద్దు : కలెక్టర్



ప్రజాశక్తి - భీమవరం

పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల నేపథ్యంలో ఫిబ్రవరి 17వ తేదీ సోమవారం జిల్లా, డివిజన్, మండల కార్యాలయాల్లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికను (పిజిఆర్ఎస్) జిల్లా అంతట తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ విషయాన్ని జిల్లా ప్రజలు దృష్టిలో ఉంచుకొని సహకరించాలని తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాల వద్ద..

ఇంకుడు గుంతలు నిర్మించాలి

జిల్లా కలెక్టర్ నాగరాణి



ప్రజాశక్తి - భీమవరం

భూగర్భ జలాల పెరుగుదలకు అంగన్వాడీ కేంద్రాల వద్ద ఇంకుడు గుంతలు నిర్మించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. జల వనరులను సంరక్షించడానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. వర్షపు నీటిని ఒడిసి పట్టేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ప్రభుత్వ భవనాలపై కురిసే వర్షపు నీరు నేరుగా భూమిలోకి వెళ్లేలా ఇంకుడు గుంతలు నిర్మించాలన్నారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడిచే అంగన్వాడీ కేంద్రాల వద్ద అవకాశం ఉన్న ప్రదేశాల్లో ఇంకుడు గుంతలు నిర్మించాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల వద్ద ఇంకుడు గుంతలు నిర్మించడానికి ఒక్కింటికీ రూ.16 వేల చొప్పున ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. జిల్లాలో 489 అంగన్వాడీ కేంద్రాల వద్ద ఇంకుడు గుంతల నిర్మాణాలకు మంజూరయ్యాయన్నారు. ఒక్క తాడేపల్లిగూడెం ప్రాంతంలో మాత్రమే 35 ఇంకుడు గుంతల నిర్మాణాలకు అనువుగా ఉందన్నారు. జిల్లాలోని మిగిలిన ప్రాంతాల్లో నిర్మాణాలకు అనువుగా లేదని పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారులు సూచించినట్లు తెలిపారు. 35 ఇంకుడు గుంతల నిర్మాణాలకు పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులకు పనులను అప్పగించడం జరిగిందనన్నారు. వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ నిబంధనలు అనుసరించి పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారులు యుద్ధ ప్రాతిపదికన ఈ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని తెలిపారు.

బావాయిపాలెంలో వ్యక్తి హత్య


మృతుడు ఏసు (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి - నిడమర్రు

ఏలూరు జిల్లా నిడమర్రు మండలం బావాయిపాలెంలో దారుణం చోటుచేసుకుంది. బావాయిపాలేనికి చెందిన మజ్జి ఏసు (26)ను గుర్తుతెలియని వ్యక్తులు కత్తులతో పొడిచి కిరాతకంగా హతమార్చి మృతదేహాన్ని కాపవరం కాలువలో పడేశారు. మృతుడి కుడి చేయి లేదు. నిడమర్రు సిఐ సుభాష్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు. ఏలూరు నుంచి పోలీసు జాగిలాన్ని రప్పించారు. మృతుడు భార్య శ్రీవల్లి ఏడు నెలల గర్భిణీ. ఏసు ఉండి మండలం కలిగొట్లలోని చేపల చెరువుల వద్ద పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి ఇంటికి రాలేదు. ఉదయం స్థానికులు కాలువలో ఏసు మృతదేహాన్ని గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వివాహేతర సంబంధమే హత్యకు కారణమనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు.

అట్టడుగువర్గాల గొంతుక పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి డివి.రాఘవులు

ఎంఎల్‌సి ఎన్నికల్లో రాజకీయ జోక్యం తగదు - మాజీ ఎంఎల్‌ఎ దిగుపాటి రాజగోపాల్


భీమవరం : ప్రచారం చేస్తున్న నేతలు

ప్రజాశక్తి - భీమవరం


అట్టడుగు వర్గాల గొంతుక, ప్రజా పక్షాన నిలిచిన పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి దిడ్ల వీర రాఘవులును గెలిపించుకోవాలని కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు, మాజీ ఎంఎల్‌ఎ దిగుపాటి రాజగోపాల్ పిలుపునిచ్చారు. ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ఎంఎల్‌సిగా పోటీచేస్తున్న పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల వీర రాఘవులు గెలుపు కోరుతూ ఆదివారం కెవిపిఎస్ బృందం జిల్లా వ్యాప్తంగా భీమవరం వీరవాసరం, అత్తిలి, గణపవరం మండలాల్లో పలు దళిత, ప్రజా సంఘాల నాయకులను, మేధావులను, అభ్యుదయ వాదులను కలిసి ఓటు అభ్యర్థించారు. ఈ సందర్భంగా రాజగోపాల్ మాట్లాడుతూ శాసనమండలి ఎన్నికల్లో పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థిగా ఆదర్శ ఉపాధ్యాయుడు, ఉద్యమ నేత, ప్రజా సమస్యలు తెలిసిన వ్యక్తి దిడ్ల వీర రాఘవులు పోటీ చేస్తున్నట్లు తెలిపారు. తన 40 ఏళ్ల ఉద్యోగ జీవితంలో సుమారు 35 ఏళ్లు ప్రజా ఉద్యమాల్లో వివిధ బాధ్యతల్లో పని చేశారన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, సమాజంలో అణగారిన ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలు ఎదుర్కొనే అనేక సమస్యలపై ఎన్నో పోరాటాల్లో భాగస్వాములు అయ్యారన్నారు. సామాన్యుడిగా ప్రజలందరి గొంతుకగా నిలబడగలిగే వ్యక్తి వీర రాఘవులు అన్నారు. 2007 నుంచి ఉమ్మడి రాష్ట్రంలోనే ఎంఎల్‌సి ఎన్నికల్లో గెలిచి పిడిఎఫ్ కూటమిగా ఏర్పడి ప్రజా సమస్యలపై నిలదీస్తూ ఆదర్శంగా ఉన్నారన్నారు. ఎలాంటి రాజకీయ పార్టీల ప్రాపకంతో, స్వలాభం కోసం కాకుండా నీతి నిజాయితీగా శాసన మండలిలో పోరాడే వ్యక్తులే పిడిఎఫ్ అని అన్నారు. మేధావుల ఎన్నికల్లో రాజకీయ పార్టీల జోక్యం సరి కాదన్నారు. ఉద్యోగులు, నిరుద్యోగులు, యువత పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల వీర రాఘవులును గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గాతల జేమ్స్, కెవిపిఎస్ జిల్లా కమిటీ సభ్యులు కింతాడ రమేష్ పాల్గొన్నారు.

ఆచంట : ఈ నెల 27వ తేదీన జరగనున్న తూర్పు - పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గాల ఎన్నికల్లో యువజనులు, విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలపై పాలకులను, ప్రభుత్వాన్ని నిలదీసి ప్రశ్నించే పిడిఎఫ్ బలపర్చిన ఎంఎల్‌సి అభ్యర్థి దిడ్ల వీర రాఘవులును మొదటి ప్రాధాన్యతా ఓటువేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని ప్రజా సంఘాల నాయకులు పి.మోహన్‌రావు పిలుపునిచ్చారు. ఆదివారం ఆచంటలో పట్టభద్రుల ఓటర్లను కలిసి ప్రచారం నిర్వహించి ఓట్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా మోహన్‌రావు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేసి టీచర్ పోస్టులు భర్తీ చేస్తామని, ఉద్యోగాలొచ్చేంత వరకూ నెలకు రూ.మూడు వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని ఎన్నికల మానిఫెస్టోలో హామీ ఇచ్చి ఓట్లు దండుకుందన్నారు. అధికారంలోకి వచ్చి దాదాపు ఎనిమిది నెలలైనా ఆ హామీ నెరవేర్చలేదన్నారు. సూపర్ సిక్స్ పథకాల అమల్లోనూ కూటమి ప్రభుత్వానికి చిత్త శుద్ధి లేదని విమర్శించారు. నిరుద్యోగుల కోసం నిరంతరం పోరాడుతున్న రాఘవులును అఖండ మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు బండి రంగారావు, తోటపల్లి సత్యనారాయణ, తలుపురి బుల్లి అబాయ్ నరేష్, కమల్ నాథ్, తదితరులు పాల్గొన్నారు.


ఆచంట : ప్రచారం చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

పేదల ఇళ్ల తొలగింపు అడ్డగింత

ఎంఎల్‌ఎ అంజిబాబు హామీతో విరమించిన ఆందోళన


బాధితులతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - భీమవరం

భీమవరంలో దౌర్జన్యంగా పేదల గుడిసెలు తొలగించడాన్ని ఆదివారం సిపిఎం నాయకులు అడ్డుకున్నారు. స్థానిక కోర్టు పక్కన ఉన్న పేదల గుడిసెలు ప్రొక్లెన్ తీసుకొచ్చి మున్సిపల్ అధికారులు పోలీసుల్ని అడ్డం పెట్టుకుని తొలగింపు చర్యలు చేపట్టడంతో బాధితుల పక్షాన సిపిఎం అండగా నిలబడింది. పేదల ఇళ్లల్లో ఉన్న సామాన్లను బయట వేసి పేదలపై దౌర్జన్యం చేసి, ఏడు కుటుంబాలను నిరాశ్రయులను చేయడాన్ని సిపిఎం వ్యతిరేకించింది. చంటి పిల్లలు, వృద్ధులు ఎక్కడికి వెళ్లాలో తెలియని స్థితిలో ఎండలో ఆకలితో అలమటిస్తూ మా గుడిసెలు తొలగించొద్దని వేడుకున్నా కనికరం చూపలేదు. ఈ నేపథ్యంలో సిపిఎం నాయకులు బి.వాసుదేవరావు, డి.త్రిమూర్తులు, ఎం.ఆంజనేయులు బాధితులతో కలిసి ఆందోళనకు దిగి అధికారులను నిలదీశారు. ఈ సందర్భంగా వాసుదేవరావు మాట్లాడుతూ పేదలను మనుషులుగా గుర్తించలేరని ప్రశ్నించారు. నోటీసులు ఇవ్వకుండా, కనీసం సమాచారమివ్వకుండా పిడుగు పడ్డట్లుగా వచ్చి ఇంట్లో సామాన్లు బయట పడేయడం దారుణమన్నారు. ఈ ప్రభుత్వానికి, అధికారులకు మానవత్వం ఉందో లేదో అర్థం కాని స్థితిలో ఉందన్నారు. ఒక పక్క పాలకులు పేదలే దేవుళ్లు, ప్రజల కోసమే మేము ఉన్నాము అని చెబుతూ మరోపక్క ఇలా దాడులు చేయడం దారుణమన్నారు. చట్ట ప్రకారం పాటించాల్సిన నిబంధనలను పాటించలేదని, కనీసం ప్రత్యామ్నాయం చూసుకునే వరకు అవకాశం ఇమ్మన్నా వినకపోవడం దారుణమన్నారు. మున్సిపల్ అధికారులతో, ప్రజాప్రతినిధులతో మాట్లాడి ప్రత్యామ్నాయం చూపించే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని బైఠాయించారు. ఈ నేపథ్యంలో స్థానిక ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) పేదలకు టిడ్కో ఇళ్లను కేటాయిస్తామని, రెండు, మూడు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

చదరంగంతో మేధస్సు పెంపు

ఎంఎల్‌ఎ రాధాకృష్ణ


విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంఎల్‌ఎ రాధాకృష్ణ

తణుకు : మెదడుకు పదును పెట్టే చదరంగం క్రీడ విద్యార్థి దశలో మేధస్సును పెంచుతుందని, జ్ఞాపకశక్తితో పాటు విద్యార్థుల్లో నైపుణ్యం పెంచేందుకు దోహదం చేస్తుందని తణుకు ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ఆదివారం ఇరగవరం మండలం ఏలేటిపాడు గ్రామంలో లక్ష్మీ చెస్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి చదరంగం పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో క్రీడలకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సారధ్యంలో యువత, విద్యార్థులను ప్రోత్సహించే విధంగా పథకాలు ప్రవేశపెడుతోందన్నారు. క్రీడల్లో రాణించే వారికి ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందన్నారు. రాష్ట్రంలో క్రీడా సౌకర్యాలు పెంచేందుకు చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారని గుర్తుచేశారు. ఎంతో మంది చదరంగం క్రీడల్లో రాణిస్తూ జాతీయ, అంతర్జాతీయ వేదికలపై తమ ప్రతిభను చాటుతున్నారని తెలిపారు. గెలుపోటములతో సంబంధం లేకుండా చదరంగంలో మంచి ఉన్నత స్థానానికి చేరుకునేలా రాష్ట్రస్థాయి, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులుగా రాణించాలని సూచించారు. క్రీడలను ప్రోత్సహిస్తూ విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేస్తున్న చరణ్‌ను ఎంఎల్‌ఎ రాధాకృష్ణ అభినందించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోటీతత్వాన్ని అలవాటు చేయాలి

తిరుమల విద్యాసంస్థల ఛైర్మన్ తిరుమలరావు



మాట్లాడుతున్న తిరుమల విద్యాసంస్థల ఛైర్మన్ తిరుమలరావు

తణుకు : విద్యార్థులకు చిన్ననాటి నుంచే పోటీతత్వాన్ని అలవాటు చేయాలని తిరుమల విద్యాసంస్థల ఛైర్మన్ తిరుమల రావు తెలియజేశారు. ఆదివారం తణుకు తిరుమల విద్యాసంస్థల ప్రాంగణంలో 5, 6, 7, 8, 9, 10వ తరగతుల విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు జరిగిన అవగాహనా సదస్సులో ఆయన మాట్లాడుతూ ఈ అవగాహన సదస్సుకు విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి అనూహ్య స్పందన లభించిందని ఈ సదస్సుకు సుమారు 4 వేల మంది హాజరైనట్లు ఆయన తెలియజేశారు. ఈ సందర్భంగా తిరుమల రావు మాట్లాడుతూ పిల్లలకు ప్రణాళికాబద్ధంగా చిన్ననాటి నుండే మంచి నడవడిక, పెద్దల యందు గౌరవం, అలాగే పోటీతత్వాన్ని అలవాటు చేస్తే ఆ పిల్లలు భవిష్యత్తులో ఎంతో ఎత్తుకు ఎదుగుతారని అన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో దేశవ్యాప్తంగా జరిగే ఇంజనీరింగ్ (జెఇఇ మెయిన్, అడ్వాన్స్) నీట్ పరీక్షలలో ఎంతో కాంపిటీషన్ ఉందని, ఆ ఒత్తిడిని తట్టుకుని మన పిల్లలు నిలవాలంటే తల్లిదండ్రులుగా మీ అందరి ప్రోత్సాహం ఎంతో అవసరమని అన్నారు. తల్లిదండ్రులు వారి బిడ్డల భవిష్యత్తు గురించి ఎంతో ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని, మానసికంగానే కాకుండా శారీరకంగా కూడా దృఢంగా ఉండేలాగ వారిని సన్నద్ధం చేయాలని అప్పుడే వారు వృద్ధిలోకి వస్తారని అన్నారు. జాతీయ స్థాయి పరీక్షలైన జెఇఇ(మెయిన్), జెఇఇ(అడ్వాన్స్‌డ్), నీట్‌లలో తరచుగా విద్యార్థులు ఎదుర్కొనే సమస్యలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రస్తుత సమాజంలో పిల్లలు ఆరు బయట ఆడుకునే ఆటలను వదిలేసి మొబైల్ ఫోన్లలో ఆటలు ఆడుతుండటంతో పిల్లలందరూ ఆ ఫోన్లకు అలవాటైపోయారని, మొబైల్లో ఎక్కువ సమయం గడిపితే జరిగే నష్టం గురించి తల్లిదండ్రులు తమ పిల్లలకు వివరించాలని అన్నారు.

తిరుమల విద్యాసంస్థల డైరెక్టర్ సున్న సరోజనిదేవి మాట్లాడుతూ ఒక కుటుంబంలో తల్లి తన పాత్రను సమర్థవంతంగా నిర్వహిస్తే ఆ కుటుంబమంతా ఎంతో ఉన్నతంగా ఉంటుందని అన్నారు. ప్రతి తల్లి తమ పిల్లలకు విలువలతో కూడిన విద్యను వారికి అందించే ప్రయత్నం చేయాలని తెలిపారు.

తిరుమల పూర్వ విద్యార్థి నేహ సంజన తల్లి లక్ష్మీ శిరీష, తిరుమల పూర్వ విద్యార్థి వైష్ణవి తండ్రి ఎసి వరప్రసాద్ పాల్గొని తిరుమల విద్యాసంస్థతో వారికున్న అనుభవాలను సదస్సుకు విచ్చేసిన తల్లిదండ్రులతో పంచుకున్నారు. ఈ సదస్సులో విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సతీష్‌బాబు, ప్రిన్సిపల్ వి.శ్రీహరి, తణుకు కాలేజ్ ప్రిన్సిపల్ కె.దుర్గా ప్రసాద్, తణుకు స్కూల్ ఇన్‌ఛార్జి విజయలక్ష్మి, విద్యార్థులు వారి తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు యూనిక్ ఐడి కేటాయింపు

మండల వ్యవసాయాధికారి సామ్యూల్ జాన్సన్



నరసాపురం: వ్యవసాయ రంగాన్ని పూర్తిగా ఆధునికీకరణ(డిజిటలైజేషన్) చేయుటకు కేంద్ర ప్రభుత్వం రైతులకు 14 అంకెల ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య(యూనిక్ ఐడీ) కేటాయిస్తుందని నరసాపురం మండల వ్యవసాయాధికారి ఎం.సామ్యూల్ జాన్సన్ తెలిపారు. ఆదివారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ ఆధార్ కార్డ్ తరహాలోనే రైతులకు ప్రత్యేకంగా ఈ కార్డు ఇస్తారని ఆయన తెలిపారు. కనుక ప్రతి రైతూ (సొంత భూమి గల రైతులు మాత్రమే) కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పలు పథకాలు, రాయితీలు పొందాలంటే 14 అంకెల విశిష్ట సంఖ్య(ఫార్మర్ రిజిస్ట్రీ) తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని ఆయన కోరారు. పిఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, పెట్టుబడి రాయితీ, ఎరువుల రాయితీ, పంటల బీమా, కనీస మద్దతు ధర, పంట రుణాలు, పలు రకాల వ్యవసాయ అనుబంధ సేవలు పొందాలంటే తప్పనిసరిగా ఈ కార్డు తీసుకోవాలని ఆయన కోరారు. సొంత భూమి కలిగిన రైతులు పట్టాదారు పాస్ పుస్తకం జిరాక్స లేదా 1బి జిరాక్స, ఆధార్ జిరాక్స, ఆధార్ నంబర్‌కు లింక్ అయిన ఫోన్ తీసుకుని రైతుసేవా కేంద్రం వద్దకు వెళ్లాలన్నారు.



గుడ్డ సంచులు పంపిణీ చేస్తున్న మున్సిపల్ అధికారులు

సంతలో గుడ్డ సంచుల పంపిణీ

ప్రజాశక్తి - భీమవరం టౌన్

మన ఆరోగ్య రక్షణ కోసం ప్లాస్టిక్ నిషేధించాలని, ప్రభుత్వం చేస్తున్న కృషికి ప్రజలందరూ సహకరించాలని బార్ అసోసియేషన్ అధ్యక్షులు యేలేటి న్యూటన్ అన్నారు. ఆదివారం భీమవరం పురపాలక సంఘం, శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో సంత మార్కెట్‌లో ప్రజలకు ఉచితంగా గుడ్డ సంచులను పంపిణీ చేశారు. ప్లాస్టిక్ బదులుగా జిల్లా కలెక్టర్, యంత్రాంగం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసారని, వాటిని వినియోగించుకోవాలని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేధంలో అందరూ భాగస్వాములై స్వచ్ఛందంగా ప్లాస్టిక్‌ను నిషేధించాలని కోరారు. అనంతరం గ్రంధి వెంకటేశ్వరరావు సంత మార్కెట్‌లో 200 మంది ప్రజలకు పబిలిశెట్టి రామకృష్ణ, కంతేటి వెంకటరావు సహకారంతో గుడ్డ సంచులను అందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ సిహెచ్.వెంకటేశ్వరరావు, రామాయణం సత్యనారాయణ పాల్గొన్నారు.

'రాజశేఖరంను గెలిపించాలి'

ప్రజాశక్తి - పాలకొల్లు

ప్రతి జనవరిలో జాబ్ క్యాలెండర్, మెగా డిఎస్‌సి అంటూ జగన్ నిరుద్యోగులను మోసం, దగా చేశారని మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. పాలకొల్లులో ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంను గెలిపించాలని కోరుతూ మంత్రి రామానాయుడు ఆదివారం ప్రచారం చేశారు. వచ్చే ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని మంత్రి అన్నారు. టిడిపి జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు, మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, నగర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర పాల్గొన్నారు.

తణుకు రూరల్ : ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంను గెలిపించాలని కోరుతూ ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని ఇరగవరం మండలంలో కూటమి నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు గోపిశెట్టి రామకృష్ణ, మాజీ జెడ్‌పిటిసి, జిల్లా ఎస్‌సి సెల్ అధ్యక్షులు చుక్కా సాయిబాబు, జనసేన అధ్యక్షులు ఆకేటి కాశి, కునుకు జనార్ధన్ పాల్గొన్నారు.

వీరవాసరం : కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని భీమవరం ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) ఓటర్లను అభ్యర్థించారు. శాసనమండలి ఎన్నికల్లో భాగంగా ఎంఎల్‌ఎ ఆదివారం బాలేపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని, కోళ్ల నాగేశ్వరరావు, వీరవల్లి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మొగల్తూరు : శాసనమండలి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికల బరిలో నిలిచిన పేరాబత్తుల రాజశేఖరంను గెలిపించాలని టిడిపి నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు కోరారు. మండల కేంద్రం మొగల్తూరులో వర్ధమానవారి వీధిలో ఆదివారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. నాయకులు గుబ్బల నాగరాజు, పాల రాంబాబు, నాగిడి రాంబాబు ఉన్నారు.

బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గణేష్‌భవాని

ప్రజాశక్తి - పాలకొల్లు

జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న అన్ని కమిటీలను రద్దు చేసినట్లు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ముద్దాడ గణేష్ భవాని ఒక ప్రకటనలో తెలిపారు. నూతన కమిటీల నిర్మాణంలో భాగంగా రాష్ట్ర అధ్యక్షులుగా బోను దుర్గ నరేష్, రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షులుగా తాను, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా భీమవరపు హేమ ఎంపికైనట్లు తెలిపారు. జిల్లా అధ్యక్షులుగా కోడె యుగంధర్, చిత్తూరు జిల్లా అధ్యక్షులుగా కె.అనిల్ కుమార్ ఎంపికైనట్లు తెలిపారు. రాష్ట్ర, జిల్లా పాలకొల్లు నియోజకవర్గ కమిటీని కొత్తగా తీసుకోవడం జరిగిందని కూడా తెలిపారు. మిగతా మండల, నియోజకవర్గ, డివిజన్, జిల్లా, రాష్ట్ర పదవులను కొత్తవారికి అవకాశం కల్పించాలని, జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య తెలిపినట్లు తెలిపారు. రాష్ట్ర అధ్యక్షులు బోను దుర్గ నరేష్ ఆదేశానుసారం ఈ పత్రికా ప్రకటన విడుదల చేయడం జరిగిందని తెలిపారు.

క్లస్టర్ కాంప్లెక్స్ మీటింగుల పేరుతో హింసించొద్దు : ఎపిటిఎఫ్

ప్రజాశక్తి - భీమవరం టౌన్

గతంలో నిర్వహించబడిన పాఠశాల కాంప్లెక్స్ సమావేశాలకు ప్రత్యామ్నాయంగా క్లస్టర్ కాంప్లెక్స్‌లో ప్రణాళిక లేకుండా నిర్వహించడం ఉపాధ్యాయులకు తీవ్రమైన ఇబ్బందిగా మారుతుందని ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు జి.ప్రకాశం ఆదివారం ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలోని అత్యధిక పాఠశాలల్లో అంతర్జాల సదుపాయం లేదని, ఒక క్లస్టర్ పరిధిలో ఒకటి లేదా రెండు ఉన్నత పాఠశాలలు మాత్రమే ఉండడం వల్ల, హాజరైన అతికొద్ది మంది పాఠశాల సహాయకులు ఏడు గ్రూపులుగా విడదీయడం వల్ల, ఒక గ్రూపులో ఇద్దరు లేదా ముగ్గురు మాత్రమే ఉండడం వల్ల భోధనభ్యాసన కృత్యాల గురించి చర్చకు తావు లేదని తెలిపారు. ఒకటి రెండు తరగతులు బోధించేవారికి, మూడు, నాలుగు, ఐదు తరగతులను బోధించే వారికి వేరు చేయడం కూడా సహేతుకం కాదని అభిప్రాయపడ్డారు. క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాలకు హాజరును తప్పనిసరి చేయడం, ఉద్దేశపూర్వకంగా సమావేశం పూర్తయిన అరగంట దాటిన వరకు హాజరుకు అనుమతించకపోవడం అధికారులకు ఉపాధ్యాయులపైగల దురాభిప్రాయం బయటపడుతుందని వీరు తెలియజేశారు. కాంప్లెక్స్ సమావేశం ముగిసిన తర్వాత సకాలంలో హాజరు స్వీకరించకపోవడం వల్ల మహిళలు, సీనియర్ ఉపాధ్యాయులు, బాలింతలు, దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవాళ్లు తీవ్రమైన ఇబ్బందులకు గురయ్యారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన సమావేశంలో లోపాలను తప్పనిసరిగా సరిచేయాలని సంబంధిత ప్రభుత్వాధికారులను కోరుతున్నారు.

కలవపూడిలో గ్రామోత్సవం

ప్రజాశక్తి - కాళ్ల

కలవపూడి గ్రామంలో దశాబ్దాల చరిత్ర కలిగిన శ్రీఉమా భీమేశ్వరస్వామి ఆలయం పునర్నిర్మాణంతో శోభాయమానంగా రూపుదిద్దుకుంది. ఈనెల 21న ఆలయ ప్రారంభోత్సవం సందర్భంగా ఆదివారం స్వామివార్ల విగ్రహాలు మేళతాళాలతో గ్రామోత్సవం నేత్రపర్వంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో యాత్రికులు, ఆలయ నిర్వాహకులు, దాతలు ఊరేగింపులో పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

పాముకాటుతో మహిళ మృతి

ప్రజాశక్తి - నరసాపురం

పాముకాటుతో మహిళ మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి స్థానికుల వివరాల ప్రకారం ఎల్‌బి చర్ల పంచాయతీ బైనపాలెం గ్రామానికి చెందిన వర్ధనపు పుష్ప(60) గృహిణి ఆదివారం చర్చికి వెళ్లి ఇంటికి వచ్చింది. బంధువులు రావడంతో టీ పెట్టడానికి కిచెన్‌లోకి వెళ్లగా కాలుపై ఏదో కుట్టినట్లు అనిపించింది. బంధువులు పామును చూసి ఆమెను వెంటనే నరసాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

బెల్ట్ షాప్ నిర్వాహకుని అరెస్ట్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో అక్రమంగా బెల్ట్ షాప్ నిర్వహిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు తాడేపల్లిగూడెం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఇ.స్వరాజ్య లక్ష్మి ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. తాడేపల్లిగూడెం ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ మురళీమోహన్, దొరబాబు, సిబ్బందితో కలిసి తాడేపల్లిగూడెంలో బెల్ట్ షాప్ నిర్వహిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని, అతని వద్ద నుంచి 6 డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలను స్వాధీనపరుచుకున్నట్లు తెలిపారు. అతనిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు.

'పదిలో' నూరుశాతం ఫలితాల సాధనే లక్ష్యం

ఎంఇఒ-1 యండమూరి లక్ష్మీనారాయణ

చిట్ చాట్



ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలో జరుగనున్న టెన్త్ పరీక్షల్లో స్థానిక విద్యార్థులు అందరూ నూరుశాతం ఫలితాలు సాధించడమే లక్ష్యంగా తీసుకొని కృషి చేస్తున్నామని ఎంఇఒ-1 యండమూరి లక్ష్మీ నారాయణ అన్నారు. ఈమేరకు శనివారం ఆయన ప్రజాశక్తితో ముచ్చటించారు.

ప్రశ్న : ఈ విద్యా సంవత్సరంలో మండలంలోని ప్రభుత్వ, ప్రయివేట్ విద్యాసంస్థల నుంచి ఎంత మంది విద్యార్థులు పది పరీక్షలకు హాజరు అవుతున్నారు?

బాలురు 246, బాలికలు 263 మొత్తం 509 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. వీటిలో ప్రయివేట్ ఇంగ్లీష్ మీడియం విద్యాసంస్థల నుంచి 105 మంది విద్యార్థులు ఉన్నారు.

ప్రశ్న : మండలంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలల వివరాలు?

నెగ్గిపూడిలోని మహాత్మా జోతిరావు పూలే బిసి గురుకుల రెసిడెన్షియల్ పాఠశాల, మార్టేరులోని బసంతీదేవి జిల్లా పరిషత్ గర్ల్స్ హై స్కూల్, ఎస్‌విజి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పెనుమంట్ర, జుత్తిగ, ఆలమూరు, మాముడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి.

ప్రశ్న : మండలంలో ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలల వివరాలు?

పెనుమంట్ర(గరువు)లోని విజయ ఇంగ్లీష్ మీడియం స్కూల్, శ్రీవాణి స్కూల్, మార్టేరులోని వివేకానంద ఇంగ్లీష్ మీడియం స్కూల్, వెలగలేరులోని విద్యా(ర్థి), శ్రీసంఘమిత్ర ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఉన్నాయి.

ప్రశ్న : మండలంలో ఎన్ని టెన్త్ పరీక్షా కేంద్రాలు ఉన్నాయి?

మండలంలో మొత్తం అన్ని ప్రభుత్వ, ప్రయివేట్ స్కూల్స్ విద్యార్థుల కోసం 4 పరీక్షా కేంద్రాలు ఉన్నాయి. అవి పెనుమంట్ర జిల్లా పరిషత్ హైస్కూల్, పొలమూరు జిల్లా పరిషత్ హైస్కూల్, మార్టేరులోని జిల్లా పరిషత్ గర్ల్స్ హైస్కూల్, నెగ్గిపూడి(మార్టేరు)లోని ఎస్‌విజి జిల్లా పరిషత్ హైస్కూల్.

ప్రశ్న : పరీక్షలు ఎప్పటి నుంచి ఎప్పటి వరకు?

మార్చి 17వ తేదీ సోమవారం నుంచి 31వ తేదీ సోమవారం వరకు పరీక్షలు నిర్వహించబడతాయి. వేళలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు.

ప్రశ్న : ఈ టెన్త్‌లో ఉత్తమ ఫలితాల కోసం విద్యాశాఖ తీసుకొనే కార్యక్రమాలు?

ప్రతీ రోజు ప్రత్యేక క్లాసులు, వెనుకబడిన విద్యార్థుల పట్ల ఉపాధ్యాయుల వ్యక్తిగత పర్యవేక్షణ. మంచి దస్తూరి కలిగి ఉండేలా అవగాహన, శిక్షణ కల్పిస్తున్నాం.

వృద్ధులకు వైద్యసేవలు

ప్రజాశక్తి - తణుకు

సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ వారు సంయుక్తంగా నిర్వహించు ఇంటింటికి వైద్యం కార్యక్రమంలో భాగంగా ఆదివారం ప్రముఖ నేత్ర వైద్యులు డా.హుస్సేన్‌అహ్మద్, ఆర్థోపెడిక్ డాక్టర్ నిమ్మగడ్డ అచ్చుతరామయ్య మండపాక, పైడిపర్రు, సజ్జాపురం ప్రాంతాల్లో పర్యటించి 8 మంది వృద్ధులకు ఉచిత వైద్యసేవలు అందజేశారు. సంఘ కార్యదర్శి ఎండి స్వాలీహ్ ఆర్థిక సహాయంతో ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు గిరిజాల నాగేశ్వరరావు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక బస్సు నడపాలి

రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సూర్యనారాయణ

ప్రజాశక్తి - ఆచంట

ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల నేపథ్యంలో ఆచంట మండలం వల్లూరు నుంచి ఆచంటకు ప్రత్యేక బస్సు నడపాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఇందుకూరి సూర్యనారాయణ రాజు అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వల్లూరు ఎంపీ పాలెం మహిళ జూనియర్ కళాశాల నుంచి సుమారు 30 మంది ఇంటర్మీడియట్ విద్యార్థినులు ఆచంట ఎంవిఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వచ్చి పబ్లిక్ పరీక్షలు రాయవలసి ఉన్న నేపథ్యంలో వారికి ప్రయాణ సౌకర్యం లేకపోవడంతో అనేక ఇబ్బందులకు గురవుతారని అన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం జోక్యం చేసుకొని ఇంటర్మీడియట్ పరీక్షలు దృష్టిలో ఉంచుకొని నరసాపురం డిపో నుంచి ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. వల్లూరు నుంచి ఆచంట రావడానికి సుమారు పది కిలోమీటర్ల దూరం నుంచి పరీక్షలు రాయాలంటే అనేక ఇబ్బందులకు గురవుతారని, ఈ రూట్లో ప్రయాణ సౌకర్యాలు కష్టంగా మారాయని కనీసం ఆటో సౌకర్యం లేవన్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు సైకిల్‌పై వచ్చి పరీక్షలు రాయలేని పరిస్థితి ఏర్పడుతుందన్నారు. తక్షణమే ఉన్నతాధికారులు కల్పించుకుని ఆ విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సులు నడిపించాలని ఆయన కోరారు.

తలసేమియా సెంటర్ నిర్మించడం హర్షణీయం

భీమవరం టౌన్ : తలసేమియా బాధితుల కోసం అమరావతిలో తలసేమియా సెంటర్ నిర్మిస్తామని హిందూపురం ఎంఎల్‌ఎ బాలకృష్ణ ప్రకటించడం హర్షించదగ్గ విషయమని ఒమిక్స్ ల్యాబోరేటరీ వైద్యులు డాక్టర్ పులగం మధుబాబు, సంఘ సేవకులు చెరుకువాడ రంగసాయి అన్నారు. ఆదివారం భీమవరంలో మీడియాతో మాట్లాడుతూ ఎన్‌టిఆర్ ట్రస్ట్ నిర్వాహకురాలు నారా భువనేశ్వరి భయంకరమైన తలసేమియా వ్యాధి బాధితుల కష్టాలు చూసి తలసేమియా కేర్ సెంటర్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారని, దీనికి స్పందించి డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ రూ.50 లక్షలు అందించడం గొప్ప విశేషమని అన్నారు. తలసేమియా బాధితుల కోసం అందరూ రక్తదానం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఒమిక్స్ ల్యాబోరేటరీలో ఉచితంగా తలసేమియా బాధితులకు చికిత్స అందిస్తామని డాక్టర్ మధుబాబు తెలిపారు. పిఆర్‌ఒ నరసింహరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

మార్టేరులో ఉచిత యోగా శిక్షణ

పెనుమంట్ర : మండలంలోని మార్టేరు పంచ గ్రామ రెడ్డి సేవా సంఘం ఆధ్వర్యంలో స్థానిక క్రీడా ఆర్మీ సహకారంతో ఆదివారం ఉదయం 6 గంటల నుంచి ఉచిత యోగా శిక్షణా శిబిరం ప్రారంభమైంది. స్థానిక రెడ్డి సేవా సంఘం ప్రాంగణంలో ప్రారంభం అయిన ఈ శిబిరంలో పలువురు పాల్గొని యోగా గురువుల ద్వారా శిక్షణ పొందారు. కాగా, సోమవారం నుంచి మరొక 15 మందికి ఈ అవకాశం ఇస్తున్నట్టు సంఘ ప్రతినిధి, స్థానిక ఎంపిటిసి గుడిమెట్ల లక్ష్మణరెడ్డి తెలిపారు. ఆసక్తిగలవారు సోమవారం ఉదయం 5:45 నిమిషాలకు రెడ్డి సేవా సంఘంలో హాజరు కావాలని, వారు సంఘ సభ్యులు పడాల రామచంద్రారెడ్డిను (8247719992) సంప్రదించాలని కోరారు.



జాతరలో పాల్గొన్న ఎంఎల్‌ఎ అంజిబాబు

ముత్యాలమ్మ జాతరలో ఎంఎల్‌ఎ

భీమవరం టౌన్ : మండలంలోని తుందుర్రు గ్రామంలో జరుగుతున్న శ్రీముత్యాలమ్మ, మారెమ్మ, మహాలక్ష్మమ్మ అమ్మవార్ల 63వ జాతర మహోత్సవంలో ఆదివారం ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. జాతరలు గ్రామ శాంతిని కోరుకుంటాయని, 62 ఏళ్లగా ఎంతో సాంప్రదాయబద్ధంగా, వైభవంగా జాతర మహోత్సవాలను నిర్వహించడం గొప్ప విశేషమని ఎంఎల్‌ఎ అన్నారు. అనంతరం దేవస్థానం ఇఒ ఎంఎల్‌ఎను సత్కరించారు.

ఎంఎల్‌సి ఎన్నికల్లో జనసేన వీర మహిళ

నరసాపురం: ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల బరిలో స్వతంత్ర అభ్యర్థిగా నరసాపురానికి చెందిన జనసేన వీర మహిళ పిప్పళ్ల సుప్రజ ఉన్నారు. సుప్రజ జనసేన ఆవిర్భావం నుంచి జనసేనలో క్రియాశీలకంగా పనిచేశారు. ఈమె పలు కళాశాలలో అధ్యాపకురాలుగా పనిచేసారు. ఎంఎల్‌సిగా గెలిచి నిరుద్యోగుల సమస్యలపై శాసన మండలిలో గళం విప్పుతానన్నారు. ఈమె నియోజకవర్గంలో విద్యార్థి దశ నుంచి పలు సేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనేవారు.

డిఆర్‌యుసిసి సభ్యునిగా పెద్దిరాజు

నరసాపురం : నరసాపురం బిజెపి నాయకుడు నడిపూడి పెద్దిరాజుకు కీలక పదవి దక్కింది. ఆయనను డివిజనల్ రైల్వే వినియోగదారుల కన్సల్టేటివ్ కమిటీ సభ్యునిగా నియమించారు. ఈ సందర్భంగా ఆయనకు నరసాపురం ఎంపీ, కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం నరసాపురం నియోజకవర్గ బిజెపి ఇన్‌ఛార్జి మేకల సతీష్ ఆధ్వర్యంలో చిట్టవరం గ్రామంలో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వే శాఖకు చెందిన అత్యంత ప్రతిష్టాత్మకమైన డిఆర్‌యుసిసి పదవి నరసాపురం వాసికి దక్కడం శుభపరిణామన్నారు.

ఎస్ఆర్‌కెఆర్‌లో ముగిసిన సంకేత 2కె25 సింపోజియం



విజేతలకు బహుమతులు అందిస్తున్న డాక్టర్ గోపాల రాజు, ప్రత్యూష

ప్రజాశక్తి - భీమవరం టౌన్

రెండు రోజులపాటు భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల మెకానికల్ ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో జరిగిన సంకేత 2కె25 జాతీయ స్థాయి విద్యార్థి సింపోజియం ఆదివారం ముగిసింది. రెండు రోజుల పాటు విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ముగింపు సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం బహుమతులు ప్రధానం చేశారు. రోబో వర్క్ షాప్‌లో ప్రథమ స్థానం పొందిన ఎస్ఆర్‌కెఆర్ మెకానికల్ విద్యార్థులకు రూ.9 వేల నగదు బహుమతి ముఖ్య అతిథులుగా హాజరైన భీమవరం ఎన్‌విఆర్ హాస్పిటల్‌కు చెందిన డాక్టర్ ఎన్‌వి గోపాలరాజు, డాక్టర్ పి.లక్ష్మీ ప్రత్యూష చేతుల మీదుగా బహుమతులు అందించారు. ఈ సందర్భంగా మెకానికల్ ఇంజనీరింగ్ హెడ్ డాక్టర్ కె.సురేష్ బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.మురళీకృష్ణమరాజు మాట్లాడుతూ విద్యార్థులు మెడికల్ ఇన్నోవేషన్‌లో కూడా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎన్‌వి.గోపాలరాజు, డాక్టర్ పి.లక్ష్మీ ప్రత్యూష మాట్లాడుతూ వైద్య రంగంలో కూడా ఎన్నో మార్పులు చోటు చేసుకుంటున్నాయని, అందుకు అనుగుణంగా యంత్రాల్లో కూడా ఇన్నోవేటివ్ ఆలోచనలతో వస్తే పేషెంట్లకు మరింత అనువుగా ఉంటాయని పేర్కొన్నారు. ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ పి.రవి వర్మ మాట్లాడుతూ రెండు రోజులపాటు జరిగిన సింపోజియంలో మొదటి రోజు శుక్రవారం కళాశాల పూర్వ విద్యార్థి ఐఐటి పాల్కడ్ మెకానికల్ ఇంజనీరింగ్ హెడ్ డాక్టర్ దినేష్ శెట్టి సంకేత సింపోజియం ప్రారంభించారన్నారు. ఇతర కళాశాలల నుంచి కూడా పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు.

ఉచిత ఆక్యుపంచర్ వైద్యసేవలు పేదలకు వరం

వైద్య నిపుణుడు కొండా శ్రీధర్



వైద్య సేవలు అందిస్తున్న వైద్యులు కొండా శ్రీధర్

ప్రజాశక్తి - నరసాపురం

కొవ్వలి రామ్మోహన్‌నాయుడు కొవ్వలి ఫౌండేషన్ ద్వారా అందిస్తున్న ఉచిత ఆక్యుపంచర్ వైద్యసేవలు పేదలకు వరంగా నిలుస్తాయని కొవ్వలి ఫౌండేషన్ కార్యదర్శి, ఆక్యుపంక్చర్ వైద్య నిపుణుడు కొండా శ్రీధర్ అన్నారు. ఆదివారం నరసాపురం పట్టణం 25 వార్డు వీవర్స్ కాలనీలో కొవ్వలి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత ఆక్యుపంక్చర్ శిబిరంలో రోగులకు శ్రీధర్ వైద్య సేవలు అందించి మాట్లాడారు. సర్వ రోగ నివారిణి ఆక్యుపంక్చర్ వైద్యమన్నారు. ఎలాంటి మందులు, ఇంజెక్షన్లు, శస్త్ర చికిత్సలు అవసరం లేకుండా అన్ని రకాల వ్యాధులను ఆక్యుపంక్చర్ వైద్యం ద్వారా నివారించవచ్చునని అన్నారు. పేదలకు, అనాధలకు, ఆపదలో ఉన్న వారికి కొవ్వలి ఫౌండేషన్ ద్వారా తమ కుటుంబ సభ్యుడు కొవ్వలి యతిరాజ రామ్మోహన్ నాయుడు సేవలను అందిస్తున్నారని, ఆయన ఆశయాలకు అనుగుణంగా తాము కూడా తనవంతు సేవలు అందిస్తున్నామని శ్రీధర్ తెలిపారు. సుమారు 100 మంది రోగులకు వైద్య సేవలను అందించామని అన్నారు. ఈ కార్యక్రమంలో సంకు భాస్కర నాయుడు, బట్టా స్వామి, కోటి, సూరిబాబు, బోగి రెడ్డి ముత్యం, అంద్రాజు లక్ష్మణ్ ఉన్నారు.

రద్దీగా మటన్ దుకాణాలు

ప్రజాశక్తి - మొగల్తూరు



మటన్ కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

మండల కేంద్రం మొగల్తూరులో ఆదివారం చికెన్ దుకాణాలు కొనుగోలుదారులు లేక వెలవెలబోయాయి. కోళ్లకు పలుచోట్ల బర్డ్ ఫ్లూ వ్యాధి సంక్రమించడంతో ప్రజలు చికెన్ కొనుగోలు చేసేందుకు ముందుకు రావడం లేదు. ప్రత్యామ్నాయంగా మటన్, చేపలు ప్రజలు కొనుగోలు చేస్తున్నారు. దీంతో ఆయా దుకాణాలు కొనుగోలుదారులతో రద్దీగా ఉన్నాయి.

పని అడిగేందుకు వెళ్లిన ఇద్దరిపై దాడి

ప్రజాశక్తి - తణుకు రూరల్

ఏదైనా పని ఉందా అని అడిగేందుకు వెళ్లిన తమను ఫంక్షన్ హాల్ యజమాని కర్రలతో దాడి చేయించాడని ఆరోపిస్తూ ఇద్దరు కార్మికులు తణుకు ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యం నిమిత్తం చేరారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. తణుకు ఇరగవరం కాలనీకి చెందిన బందుల రాంబాబు, విప్పర్తి ప్రభాకర్ రావు ఆదివారం మధ్యాహ్నం తణుకులోని ఒక ఫంక్షన్ హాల్ వద్దకు ట్రాక్టర్ డ్రైవర్ పండుతో పాటు వెళ్లారు. వీరు మున్సిపాలిటీలో వర్కర్ల అవసరమైనప్పుడు టెంపరరీ పద్ధతిలో పనిచేస్తుంటారు. అప్పటికే ఫంక్షన్ హాల్‌లో ఫంక్షన్ జరిగింది. రాజు గేట్ బయట ఉండగా రాంబాబు, ప్రభాకర్ రావులు ఏదైనా పని ఉందా అని అడిగేందుకు కన్వెన్షన్ హాల్ లోపలికి వెళ్లారు. దీంతో అక్కడే ఉన్న ఫంక్షన్ హాల్ యజమాని, అతని కుమారుడు దొంగతనానికి వచ్చారని మరి కొంతమందితో కలిసి వీరిద్దరిపై దాడి చేసినట్లు బాధితులు వాపోయారు. కేసు నమోదు చేసి తమకు న్యాయం చేయాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు. కేసు నమోదు చేయకుండా పోలీసులపై రాజకీయ ఒత్తిడి తెస్తున్నట్లు బాధితులు ఆరోపిస్తున్నారు.

చెత్తకు డంపింగ్ యార్డ్‌గా ప్రధాన పంట కాలువ

పట్టించుకోని ఇరిగేషన్ శాఖ, ప్రజాప్రతినిధులు

రైతులు, ప్రజల ఆవేదన

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోని మార్టేరు వద్ద నరసాపురం ప్రధాన పంట కాలువ పరిసర ప్రాంతాల్లోని వర్తక, వ్యాపారులకు చెత్తను పారబోసే డంపింగ్ యార్డ్‌గా మారిందని ఆయకట్టు రైతులు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిడదవోలు నుంచి నరసాపురం వెళ్లే ప్రధాన పంట కాలువ పరిస్థితి చెత్తతోను, కోళ్ల, పశువుల వ్యర్థాలతో నింపివేస్తున్నా, ఇరిగేషన్ శాఖ అధికారులుగానీ, నీటి సంఘాల ప్రతినిధులు గానీ, ప్రజా ప్రతినిధులు గానీ పట్టించుకోవడం లేదని వారు తీవ్రంగా విమర్శిస్తున్నారు. వ్యవసాయ భూముల కోసం, గృహ నిత్య అవసరాల కోసం, రక్షిత మంచినీటి పథకం కింద వాటర్ ట్యాంక్‌లకు ఈ నీరు వెళుతుందని వారు పేర్కొన్నారు. పిల్ల కాలువలు ద్వారా ప్రతి గ్రామానికి ఈ పంట కాలవ నుంచి నీటి సరఫరా చేయాలని, అయితే ప్రస్తుతం పంట కాలువలో ఉన్నటువంటి మలినమైన నీరు వల్ల, ప్రజల ఆరోగ్యం పరిస్థితి ఏమిటని వారంతా ప్రశ్నిస్తున్నారు.



డంపింగ్ యార్డుగా మారిన పంటకాలువ

బండి ముత్యాలమ్మ సన్నిధిలో యాత్రికులు

మొగల్తూరు : మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో వేంచేసి ఉన్న బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం ఆదివారం యాత్రికులతో సందడి నెలకొంది. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో బండి ముత్యాలమ్మ భజన సంఘం ఆధ్వర్యంలో ఆలపించిన గీతాలు ఆకట్టుకున్నాయి. ఆలయ కార్యనిర్వహణాధికారి మోకా అరుణ్ కుమార్, ఛైర్మన్ కడలి మాణిక్యాలరావుల పర్యవేక్షణలో సిబ్బంది, పాలకవర్గ సభ్యులు యాత్రికులకు ఏర్పాట్లు చేశారు.